


# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 109,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,గురువారం, తేదీ : 20-08-2026

### అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా 60 కి.మీ. చొరబాటు..
## ఖండించిన కేంద్ర మంత్రి రిజిజు



- భారత్–చైనా మధ్య సరిహద్దు ఇంకా స్పష్టంగా రూపుదిద్దుకోలేదన్న కేంద్రమంత్రి
- కాంగ్రెస్ ప్రభుత్వాలు సరిహద్దుల్లో మౌలిక వసతులు నిర్మించలేదని వెల్లడి
- తప్పుడు వీడియోలతో సైన్యం స్థైర్యాన్ని దెబ్బతీయొద్దని వ్యాఖ్య
- సరిహద్దు ప్రాంతాల్లో ఐటీబీపీ పెట్రోలింగ్ బలోపేతం చేశామన్న కిరణ్ రిజిజు

## మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది

- విద్యార్థుల భవిష్యత్తును మోదీ సర్కార్ నాశనం చేసింది
- యువత కోసం కొత్త రోడ్‌మ్యాప్ కావాలి మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు

ఢిల్లి : విద్యార్థులు, యువత భవిష్యత్తును గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేలా కాంగ్రెస్ సమగ్ర 'ఎడ్యుకేషన్ టు ఎంప్లాయ్‌మెంట్ రోడ్‌మ్యాప్' రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. దిల్లీలని



ఇందిరా భవన్ లో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభ ప్రసంగం సందర్భంగా ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలో కొత్త పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. అవి కాకపోగా, ఇటీవల సంవత్సరాల్లో సుమారు 94వేల పాఠశాలలు మూతపడ్డాయి. యువత భవిష్యత్తును మెరుగుపరిచే విధానాల స్థానంలో విద్యా రంగంలో ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేటీకరణ పెరగడంతో ఉన్నత విద్య ఖరీదైనదిగా మారుతోంది. సాధారణ కుటుంబాలకు మిగతా..2లో

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు..

- విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ
- దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందన్న ఖర్గే
- ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపణ
- కేంద్రం నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపై నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శ


వివరాలు 2లో..

ఢిల్లి : ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళు_న్నాయని ఆయన ఆరోపించారు.

### 22 బాధితులెవరూ
## ఆందోళన చెందొద్దు



- బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో తామంతా మీకు అన్ని వేళలా అండగా ఉంటామని హరీశ్‌రావు హామీ
- బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణభవన్‌లో 10 మంది న్యాయవాదులతో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని

# వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే

- గీత కార్మికులకు పింఛన్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటన
- వారి కోసం ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్ల పెంచుతామన్న సీఎం
- కేసీఆర్ సర్కార్ పిల్లల చదువులను విస్మరించిందని విమర్శలు
- హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్ : తెలంగాణలోని గీత కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ గీత కార్మికుడికి పింఛను అందిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ఆయన ఈ ప్రకటన చేశారు. గీత కార్మికుల జీవనోపాధిని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. మిగతా..2లో

## రైతుల ఆదాయాన్ని పెంచడమే బ్యాంకుల లక్ష్యం
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకులు మరింత చురుగ్గా వ్యవహరించాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.
- రైతులే బ్యాంకుల వద్దకు వచ్చే పరిస్థితి కాకుండా..
- బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లి అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందించాలని స్పష్టం చేశారు..



హైదరాబాద్, ఆగస్టు 19: స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు

## జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య



- జమ్మూకశ్మీర్ భారత్‌లో కీలక భాగం అన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో పర్యటిస్తున్న యూఎస్ ప్రతినిధి
- భద్రత మెరుగుపడింది, ప్రయాణ ఆంక్షలు సడలించాలన్న రాయబారి
- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలతో భేటీ, లెఫ్టినెంట్ గవర్నర్‌తోనూ సమావేశం

ఢిల్లి : జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. మిగతా..2లో

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

హైదరాబాద్: భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది. మిగతా..2లో

### రాష్ట్రంలో 37 డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామన్న మంత్రి



- 175 నియోజకవర్గాల్లో మోడల్ గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రణాళిక
- ఆళ్లగడ్డ కాలేజీకి కొత్త భవనం, కడప లైబ్రరీ 9 నెలల్లో పూర్తి చేస్తామని హామీ
- అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుకు సన్నాహాలు
- విశాఖ, రాయలసీమల్లోనూ భారీ జోనల్ గ్రంథాలయాల నిర్మాణం

## వెలిగొండ నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు

- వెలిగొండ నిర్వాసితులకు పరిహారం చెక్ అందజేసిన సీఎం చంద్రబాబు
- రూ.200కోట్ల మేర నిర్వాసితులకు పరిహారం చెల్లించిన సీఎం
- చంద్రబాబు అన్ని సౌకర్యాలు కల్పించారన్న నిర్వాసితులు

అమరావతి : వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైన వేళ నిర్వాసితులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఇవాళ మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నిర్వాసిత కుటుంబాలకు అందజేశారు. ఇప్పటికే ఓటీఎస్ కింద 2557 కుటుంబాలకు రూ.318 కోట్లు చెల్లించగా, తాజాగా మరో 1600 కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కులు అందాయి. దీంతో 4157 నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటివరకు రూ.518 కోట్ల పరిహారం అందించినట్లైంది.



వెలిగొండ నిర్వాసితులకు పరిహారం చెక్ అందజేసిన సీఎం చంద్రబాబు

త్యాగం చేసిన నిర్వాసితులకు అండగా నిలవడమే తమ సర్కార్ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వెలిగొండ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు మిగతా..2లో

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి



- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా

అమరావతి : కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రైతుల ఆదాయాన్ని పెంచడమే బ్యాంకుల లక్ష్యం

మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. మీవీజులకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. జ+మీజు కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

## 22 బాధితులెవరూ ఆందోళన చెందొద్దు

హైదరాబాద్ : రేవంత్ సర్కారు ప్రజల ఆస్తులను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టడంపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో పలువురు బాధితులు ఇవాళ తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావును కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు వారికి భరోసా ఇచ్చారు. 22ఏ బాధితులెవరూ ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో తామంతా మీకు అన్ని వేళలా అండగా ఉంటామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణభవన్‌లో 10 మంది న్యాయవాదులతో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. లీగల్ సెల్ సపోర్ట్‌తోపాటు ఎమ్మెల్యేలుగా తాము కూడా అధికారులతో, కలెక్టర్లతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేదాకా అండగా ఉంటామని అన్నారు.

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

## జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మల్లు రవి స్పందన

**పరకాల టికెట్ మళ్లీ రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఇస్తామన్న రేవంత్**

**ఎన్నికలకు చాలా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారన్న సుస్మిత**

**పార్టీలో క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవన్న మల్లు రవి**

హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ టికెట్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. పరకాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ సీఎం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే సీఎం రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ముల భాగోతాలు, స్కాములను బయటపెడతానని హెచ్చరించడం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సుస్మిత వ్యాఖ్యలపై పూర్తి సమాచారం తెప్పించుకున్న తర్వాత క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీలో లక్ష్మణరేఖను దాటి ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఈ అంతర్గత వివాదంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పందిస్తూ, పూర్తి నివేదిక ఇవ్వాలని పీసీసీ నాయకత్వాన్ని ఆదేశించారు. మరోవైపు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ, పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని, అనవసర వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వబోనని తెలిపారు.

## అమిత్ షాపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు

ఢిల్లీ : బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయానికి అమిత్ షా ఇంకా పుట్టలేదని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ నేతల పాత్రను గుర్తుచేస్తూ, దేశభక్తి గురించి తమకు పాఠాలు చెప్పే హక్కు బీజేపీకి లేదని వ్యాఖ్యనించారు. దక్షిణ గోవాలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ పదేపదే గాంధీ కుటుంబం సోనియా గాంధీ గురించి ప్రస్తావిస్తోంది. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికే అమిత్ షా ఇంకా పుట్టలేదు. ఆయన వయసెంత? 57 లేదా 58 ఏళ్లా? 56-58 ఏళ్ల వయసున్న నాయకులు మాకు దేశభక్తి గురించి చెబుతున్నారు. గాంధీజీ తన జీవితాన్నే దేశ స్వాతంత్ర్యం కోసం అంకితం చేశారు. నెహ్రూ 14 ఏళ్ల పాటు జైలులో గడిపారు. అలాంటి చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. దేశ స్వాతంత్ర్యం కోసం తమ నాయకులు పోరాడారు. మరి బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ నుంచి ఏ నాయకుడు స్వాతంత్ర్యం కోసం పోరాడారు? దేశభక్తి ఉంటే ఐక్యత గురించి బీజేపీ మాట్లాడాలి. ప్రజలను విడదీయడం, ఘర్షణలకు కారణమవడం దేశభక్తి కాదు. మత సామరస్యం, లౌకికవాదం, ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేయడమే నిజమైన దేశభక్తి' అని ఖర్గే వ్యాఖ్యానించారు. 'మతం పేరుతో విభజన సరికాదు' లో తన బహిరంగ సభ జరిగిన ప్రాంతంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడాన్ని కూడా ఖర్గే ప్రస్తావించారు. లక్షలాది మంది సమక్షంలో తాను ప్రసంగించిన తర్వాత అక్కడ శుద్ధీకరణ చేయడమేంటని

# వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే

మొదటి పేజి తరువాయి

వారి ఉపాధిని పెంచేందుకు ప్రభుత్వ భూములు, కాలువ గట్ల వెంబడి ఈత, తాటి చెట్లను విరివిగా పెంచుతామని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 5 లక్షల పరిహారం అందిస్తోందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వం గేదెలు, గొర్రెల పెంపకం వంటి కులవృత్తులను ప్రోత్సహించినట్టే చేసి, వారి పిల్లల చదువులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. తమ ఇందిరమ్మ పాలనలో బహుజనుల పిల్లలు చదువుకుని డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్ అధికారులు కావాలని



ప్రోత్సహిస్తున్నామని, ఇదే నిజమైన సామాజిక న్యాయమని పేర్కొన్నారు. కేసీఆర్ చేసింది కుటుంబ న్యాయం అయితే, తాను చేస్తోంది సామాజిక న్యాయం అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రానికి కరవు రావాలని, రైతులు నష్టపోవాలని హరీశ్ రావు కర్ణాటక, తమిళనాడు వెళ్లి క్షుద్ర పూజలు చేస్తున్నారని విమర్శించారు. "క్షుద్ర పూజలు చేసే వారిని చెట్లకు కట్టేసి కొట్టాలి" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ, గౌడ కులస్తులు తమకు పూర్తి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా 60 కి.మీ. చొరబాటు.. ఖండించిన కేంద్ర మంత్రి రిజిజు

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : అరుణాచల్ ప్రదేశ్‌లోకి చైనా సైన్యం 60 కిలోమీటర్ల మేర చొచ్చుకొచ్చిందంటూ వస్తున్న వార్తలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. ఈ కథనాలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని స్పష్టం చేశారు. అరుణాచల్‌లోని అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో వాస్తవాధీన రేఖను దాటి చైనా సైనికులు లోపలికి వచ్చినట్లు స్థానికులు ఆరోపించిన నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ, "భారత్-చైనా మధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో సుదీర్ఘ సరిహద్దు ఉంది. క్షేత్రస్థాయిలో ఈ సరిహద్దును ఇప్పటికీ పూర్తిస్థాయిలో, స్పష్టంగా నిర్ణయించలేదు. టిబెట్‌తో మన సరిహద్దును గతంలో సరిగ్గా గుర్తించకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు పెరిగాయి" అని వివరించారు. స్థానికుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెబుతూనే, బంగ్లాదేశ్‌కు చెందిన పాత వీడియోలను సామాజిక మాధ్యమాల్లో చూపిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి చర్యలు సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనిక బలగాల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనలో గత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కిరణ్ రిజిజు ఈ సందర్భంగా ఆరోపించారు. "సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు నిర్మించకపోవడమే తమ విధానమని నాటి రక్షణ మంత్రి ఏకే ఆంటోనీ పార్లమెంటులోనే చెప్పారు. దీనివల్ల చైనా మనకంటే ముందే అక్కడే మౌలిక సదుపాయాలను నిర్మించుకోగలిగింది. 2014లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రోడ్లు లేని మారుమూల ప్రాంతాల్లోనూ యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టాం" అని తెలిపారు. సరిహద్దులు స్పష్టంగా లేని కొన్ని



ఎత్తయిన ప్రాంతాల్లో చైనా గతంలోనే శిబిరాలు ఏర్పాటు చేసుకుందని, అంతేకానీ భారత గ్రామాలను ఆక్రమించుకోలేదని రిజిజు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఇండో-టిబెటన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) గస్తీని మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు.

## వెలిగొండ నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు

మొదటి పేజి తరువాయి

పరిహారం అందిస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు రూ.518 కోట్లు పరిహారం చెల్లించామని, మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మంచి చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించాలని, నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వెలిగొండ నిర్వాసితులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు సొంత ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలకు పరిహారం అందించడంతోపాటు పునరావాస కాలనీల్లో మౌలిక వసతులపై సర్కార్ దృష్టి సారించింది. మొత్తం ఏడు ఆర్అండ్ఆర్ కాలనీల్లో వసతుల కల్పన చేపట్టగా పనులు దాదాపు పూర్తయ్యాయి. దీంతో నిర్వాసిత కుటుంబాలు పునరావాస కాలనీలకు తరలివెళు_న్నాయి. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన వెలిగొండ నిర్వాసితులతో కలిసి నేతలు మాట్లాడారు. వెలిగొండ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదని నేతలు స్పష్టం చేశారు. మిగిలిన రూ.400 కోట్ల పరిహారాన్ని కూడా త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు నీరందిస్తామని తెలిపారు. పూర్తికాని వెలిగొండ ప్రాజెక్టు పూర్తైనట్లు జగన్ జాతికి అంకితం చేయడం ప్రపంచంలో ఎనిమిదవ వింతని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసింది. నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం చెల్లింపులో వైఎస్ జగన్ పైసా కూడా చెల్లించలేదు. వెలిగొండ పనులు పూర్తి చేయడం ఎంత ముఖ్యమో నిర్వాసితులు కూడా అంతే ముఖ్యం. నిర్వాసితులకు సంబంధించిన ఏడు కాలనీల్లో నాలుగు కాలనీల్లో 100 శాతం మౌలిక వసతులు పూర్తయ్యాయి. మిగిలిన మూడు కాలనీల్లో పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని' నిమ్మల రామానాయుడు వెల్లడించారు. వెలిగొండ విషయంలో గత ప్రభుత్వం నిర్వాసితులను, రైతులను తీవ్రంగా మోసం చేసిందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. పూర్తికాని ప్రాజెక్టును పూర్తైనట్లు ప్రకటించి జాతికి అంకితం చేసిన ఘనత వైఎస్సార్సీపీకే దక్కుతుందని విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి దీన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. నిర్వాసితులు గ్రామాలను ఖాళీ చేసి పునరావాస ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు. మరోవైపు చెప్పినట్లుగానే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. వెలిగొండ నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించిన తర్వాతే నీటిని విడుదల చేస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును క్రమపద్ధతిలో పూర్తి చేయడంతోపాటు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికీ సమాన ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడించారు. తమకు జిల్లాతో పాటు వెలిగొండ పూర్తి చేసిన సీఎం పేరు మీద చంద్రన్న మార్కాపురం జిల్లాగా పేరు పెట్టాలని 117 మంది శాసనసభ్యులు సంతకాలు చేశారని కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన సాయం మర్చిపోలేం : ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని నిర్వాసితులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన సాయం మర్చిపోలేమన్నారు. తాము చూడలేం అనుకున్న ప్రాజెక్టు పూర్తయినందుకు ఆనందంగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. మొత్తంగా వెలిగొండ నిర్వాసితుల త్యాగాలకు పరిహారంతో ప్రభుత్వం భరోసా కల్పించింది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఈ ప్రాజెక్టు పూర్తికి అడుగులు వేగవంతమయ్యాయి.

## మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది: ఖర్గే

మొదటి పేజి తరువాయి

ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోతోంది. విద్యా సంస్థల్లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తుల ప్రాబల్యం పెరుగుతోంది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో సంస్థల స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఖర్గే అన్నారు.

**'పేపర్ లీకులు నియామకాల జాప్యం'**

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువతకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని ఖర్గే పేర్కొన్నారు. పేపర్ లీకులు, నియామక పరీక్షల్లో అక్రమాలు, ఉద్యోగ నియామకాల్లో జాప్యం కారణంగా నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులే ఈ పరిణామాలతో ఎక్కువగా నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. యువతలో దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదని అన్నారు. వారి సమస్యలను వినడానికి ప్రభుత్వం ఎప్పుడూ తగినంత సమయం కేటాయించలేదని, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా తాత్కాలిక చర్యలతో వాటిని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. దీంతో యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. యువత సమస్యలను కాంగ్రెస్ తన రాజకీయ అజెండాలో చేర్చిందని ఖర్గే తెలిపారు. రాహుల్ గాంధీ ఛత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లోనూ విద్య, పరీక్షలకు సంబంధించిన సమస్యలపై సమగ్ర చర్చ జరగాలని కాంగ్రెస్ కోరిందన్నారు.

రామాలయ విరాళాల అంశంపైనా ప్రశ్నలు



ఈ సందర్భంగా అయోధ్య రామాలయానికి సంబంధించిన విరాళాలపై వచ్చిన ఆరోపణలను కూడా ఖర్గే ప్రస్తావించారు. విరాళాల నిధుల దుర్వినియోగం లేదా చోరీ జరిగిందన్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రధాని ప్రజలకు సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఆర్థిక అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**చైనా చొరబాట్లపైనా ప్రశ్నలు**

భారత్-చైనా సరిహద్దుల్లో చైనా చొరబాట్లకు సంబంధించిన వార్తలపైనా ఖర్గే స్పందించారు. జాతీయ భద్రతను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకూడదని అన్నారు. అదే సమయంలో సరిహద్దుల పరిస్థితిపై ప్రజలు ప్రశ్నలు అడగకుండా జాతీయ భద్రత పేరుతో అడ్డుకోవడం కూడా సరికాదని వ్యాఖ్యానించారు. భారత సాయుధ దళాలపై తమకు అత్యంత గౌరవం ఉందని, అయితే సరిహద్దుల్లో వాస్తవ పరిస్థితి, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రజలకు పారదర్శకంగా సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

**రాజీవ్ గాంధీని గుర్తుచేసుకున్న ఖర్గే**

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్నప్పటికీ కీలక రంగాల్లో పరిస్థితులు మెరుగుపడటానికి బదులుగా దిగజారుతున్నాయని ఖర్గే వ్యాఖ్యానించారు. మతపరమైన ఉద్రిక్తతలు, రేవడి సంస్కృతి రాజకీయాల మధ్య విద్య, ఉపాధి అంశాలు తీవ్రంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్న ఖర్గే, భారీ మెజారిటీతో ప్రభుత్వం నడిపినప్పటికీ రాజీవ్ గాంధీ యువతను తన విధానాల కేంద్రంగా ఉంచారని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత అందుబాటు ధరల్లో విద్యను విస్తరించేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలే పేదలు, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక పురోగతికి మార్గం చూపాయని పేర్కొన్నారు.

**కీలక నేతల హాజరు**

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఖర్గే అధ్యక్షత వహించారు. మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ సహా పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. సీనియర్ నాయకులు అంబికా సోని, ముకుల్ వాస్నిక్, పీ చిదంబరం తదితర అగ్రనేతలు కూడా పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

## రాష్ట్రంలో 37 డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామన్న మంత్రి

మొదటి పేజి తరువాయి

అమరావతి : రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇందులో భాగంగా సొంత భవనాలు లేని 37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించామని శాసనసభలో ప్రకటించారు. ఇవాళ శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ప్రస్తుతం ఆ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 1038కి చేరిందని, కళాశాలకు అవసరమైన భూమి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రత్యేక పథకం కింద ఆళ్లగడ్డ కాలేజీకి కొత్త భవనం, ధ్వంసమైన ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అవసరమైన టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు ల్యాబ్స్, కంప్యూటర్లు, బెంచీలను ఎమ్మెల్యే కోటా నిధుల (గ్రా4) కింద సమకూర్చుకోవాలని సూచించారు. ఒక్కో డిగ్రీ కళాశాల పూర్తిస్థాయిలో నిర్మించడానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చవుతుందని, దశలవారీగా అన్ని కాలేజీలకు మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.



**గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో గ్రంథాలయాల వ్యవస్థను బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని లోకేశ్ తెలిపారు. కడపలో గ్రంథాలయ నిర్మాణ పనులపై ఎమ్మెల్యే మాధవీ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, రాబోయే తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం గ్రంథాలయాలకు చెందాల్సిన సెస్సు నిధులను ట్రెజరీకి మళ్లించిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ నిధులను తిరిగి గ్రంథాలయ శాఖకు అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. మంగళగిరిలో కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీ విజయవంతమైందని, రాత్రి 8 గంటల తర్వాత కూడా 300 మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, పారిశ్రామి కవేత్తలు, పూర్వ విద్యార్థులు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకరిస్తే గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయవచ్చని పిలుపునిచ్చారు.

**అమరావతి, విశాఖ, రాయలసీమల్లో భారీ లైబ్రరీలు**

అమరావతిలో గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్, తెలుగు కల్చరల్ సెంటర్‌తో అనుసంధానించి దేశంలోనే అత్యుత్తమ సెంట్రల్ లైబ్రరీని నిర్మించనున్నట్లు లోకేశ్ ప్రకటించారు. త్వరలోనే దీని డిజైన్ ఖరారు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. దీనికి దీటుగా విశాఖపట్నంలోని ఆంధ్రాయూనివర్సిటీ కేంద్రంగా ఒక జోనల్ లైబ్రరీని, రాయలసీమ కేంద్రంగా మరో అత్యాధునిక జోనల్ లైబ్రరీని అన్ని హంగులతో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పుస్తక పఠనం పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతుందని, వారిని స్మార్ట్‌ఫోన్లు, ఐప్యాడ్‌లకు దూరం చేయడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

గురువారం 20-08-2026

# నడిగూడెం పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ నరసింహ ఆకస్మిక తనిఖీ

**అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం..**
**మహిళలు, బాలల భద్రతకు అధిక ప్రాధాన్యం: ఎస్పీ**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ నేడు ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ సిబ్బంది పనితీరు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజలకు పారదర్శకంగా, వేగంగా పోలీస్ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా సైబర్ మోసాలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించి, పోగొట్టుకున్న నగదును తిరిగి పొందేలా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుని వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, బాలల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలు లేదా బాలలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి వారికి పూర్తి రక్షణ కల్పించాలని సూచించారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. పాత నేరస్థులు, నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టి, అవసరమైన సందర్భాల్లో చట్ట ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు నమ్మకమైన పోలీసింగ్ అందించే విధంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ నరసింహ తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలో మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ తేజస్విని, నడిగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## తొండంగి మత్స్యకారులకు హార్బర్.. ఏలేరు నీటికి బెడ్ లెవెల్స్ : యనమల దివ్య

**కోనలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని డిమాండ్.**
**. ముంపు గ్రామాలకు రక్షణగా పక్కపోటు కెనాల్ పనులు చేపట్టాలని వినతి**



**తేటగుంట ఆగస్ట్ 19 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తొండంగి మండల సముద్రతీర ప్రాంతంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల కోసం కోనలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించిన ఆమె.. మత్స్యకారుల సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకెళ్లారు.చేపల వేట ద్వారా మత్స్య సంపద పెంపుతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోందని యనమల దివ్య పేర్కొన్నారు. గంగపుత్రుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అయితే తొండంగి తీర ప్రాంత మత్స్యకారులకు పడవలు నిల్వ చేసుకునేందుకు, చేపలను భద్రపరిచేందుకు తగిన సదుపాయాలు లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి అవసరాలను తీర్చేందుకు కోనలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఏలేరు జలాలు ఆయకట్టు శివారు భూములకు చేరేలా చర్యలు తీసుకోవాలని యనమల దివ్య కోరారు. ఏలేరు కాల్వలకు బెడ్ లెవెల్స్ లేకపోవడంతో ఆయకట్టు శివారు ప్రాంతమైన తొండంగి మండలానికి నీరు అందడం లేదని అసెంబ్లీలో వివరించారు. రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు తక్షణమే బెడ్ లెవెల్ పనులు పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రిని కోరారు.అదేవిధంగా పంపా రిజర్వాయర్‌పై ఉన్న పక్కపోటు కెనాల్‌కు వైడింగ్, డిస్టిలేషన్ లేకపోవడం వల్ల తొండంగి మండలంలోని కృష్ణాపురం నుంచి వేమవరం వరకు ఉన్న జిల్లేడిపాడు, పైడికొండ, కొత్తపేట, ఎల్లయ్యపేట, ముసలయ్యపేట తదితర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల డిమాండ్ మేరకు పక్కపోటు కెనాల్‌కు అవసరమైన వైడింగ్ పనులు చేపట్టి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని యనమల దివ్య ప్రభుత్వాన్ని కోరారు.

## యనమల రామకృష్ణుడు, యనమల దివ్య ఆధ్వర్యంలో మహా వరుణ యాగం ప్రారంభం



**తుని ,(తేటగుంట) ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తేటగుంటలోని యనమల గార్డెన్స్ భక్తిరసం, ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. వరుణ కటాక్షంతో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ యనమల దివ్య సారథ్యంలో నిర్వహించనున్న నాలుగు రోజుల మహా వరుణ యాగం ప్రారంభమైంది.సమాజ శ్రేయస్సు, రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ యనమల దంపతులు యాగానికి అంకురార్పణ చేశారు. రైతు ప్రతినిధులు చిటికెల శ్రీనివాసరావు దంపతులు, పోతల సూరిబాబు, తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ వరలక్ష్మీ, దర్భా శ్రీనివాస్, కుర్రా వెంకటరమణ, అత్తి వెంకట సుబ్బారావు, యామాల అప్పారావు దంపతులు పాల్గొన్నారు. యాగం ఫలించి విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ యనమల దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం ఋత్వికులను ఆహ్వానించి యాగం విజయవంతంగా కొనసాగాలని కోరుతూ పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఋత్వికులు వేదమంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.త్రయాహ్నిక దీక్ష యాగంలో భాగంగా తొలిరోజు పూజా కార్యక్రమాలు భక్తిభావాన్ని నింపాయి. ఋత్వికులు పుష్యంగ మహర్షి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ నిర్వహించి జపాలు, అభిషేకాలు చేపట్టగా, ఆరుగురు వేదపండితులు జలజపం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని వీక్షించేందుకు తుని నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రముఖులు, రైతులు పెద్ద సంఖ్యలో యనమల గార్డెన్స్‌కు తరలివచ్చారు. దీంతో యనమల గార్డెన్స్ భక్తజన సంద్రంగా మారింది.

## శ్రీ ప్రకాష్ 50వ వ్యవస్థాపక విశేష స్పందన




**తుని , ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు 49 వసంతాలు పూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న 50వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పాయకరావుపేట, తుని, అన్నవరం శాఖల్లో ఈ శిబిరాలను నిర్వహించారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.2004 నుంచి ఇప్పటివరకు సుమారు 3,000 యూనిట్ల రక్తాన్ని విద్యార్థులు, సిబ్బంది అందించారని, తద్వారా తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారని సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. తాజా శిబిరంలో సుమారు 400 మంది రక్తదానం చేశారు.ఈ సందర్భంగా 40 సార్లకు పైగా రక్తదానం చేసిన పలువురిని జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంకు డా. పి. కామరాజు, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు డా. పరాసర్, మదర్ బ్లడ్ బ్యాంకు డా. సత్యన్నారాయణ, వీనస్ బ్లడ్ బ్యాంకు డా. సాల్మన్ రాజ్, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. రామకృష్ణారెడ్డి, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధితో ప్రజా జీవన ప్రమాణాల పెంపు : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్వర్క్** కుత్బుల్లాపూర్ డివిజన్ 131 పరిధి బాల్ రెడ్డి నగర్ లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దాదాపు 67.50 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూప్రజా మౌళిక వసతుల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాల పెంపు సాధ్యమని, ప్రజలకు మౌళిక వసతులను కల్పించేందుకు గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ డివిజన్లలోని కాలనీలను అభివృద్ధి పరుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ భద్రు, డీఈ దుర్గా ప్రసాద్, ఏఈ అభిరామ్, వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, కాలనీ అధ్యక్షులు దుర్గా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి చారి, సాయిబాబా దేవాలయం చైర్మన్ పి. సుధాకర్ రెడ్డి కాలనీ వాసులు పి.లింగారెడ్డి, రామారావు కార్తీక్, వెంకటయ్య, క్రిష్ణ ప్రసాద్, కోటి రెడ్డి అరుణా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ ప్రెసిడెంట్ దేవరకొండ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, ఎండి.నజీర్, నార్లకంటి బాలయ్య, రాకేష్ జాలిగం, బొంబాయి శ్రీను రమణా రెడ్డి మహేష్ మధుకర్ రెడ్డి, రమణా రెడ్డి ఆంజనేయులు కళ్లెం శ్రీనివాస్, వెంకటేష్, ఖలీల్ శ్రీనాధ్, అజయ్, నాగేష్ ప్రసాద్, దిలీప్ సెర్వి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూములను అందరం కలిసి కాపాడుకుందాం.

**భూముల పరిరక్షణ కమిటీ పిలుపు.**




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** జగద్గిరిగుట్ట లో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూములను కాపాడుకుందాం అని కోరుతూ నేడు దేవాలయం వద్ద దేవాలయ భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా జగద్గిరిగుట్టలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన 14 ఎకరాల ఆరు గుంటల ప్రభుత్వ స్థలం నేడు అన్యాక్రాంతమవుతుందని గత కొద్ది సంవత్సరాల నుంచి పోరాడుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడం వల్ల ఉన్న స్థలం కూడా కోల్పోయే ప్రమాదం ఉన్నందున జగద్గిరిగుట్ట ప్రజలందరూ కలిసి ఈ స్థలాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సినటువంటి ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులు గాని, రాజకీయ పార్టీల నాయకులు గాని, రెవెన్యూ అధికారులు కానీ కనీసం స్పందించడం లేదని అందుకే ప్రజలందరిని కలుపుకొని ఈ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని అన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తులు ఇచ్చినప్పటికీ వారు చేస్తున్నామని చెప్పి కూల్చకపోవడమనేది రెవెన్యూ అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తోందని కమిటీ అభిప్రాయపడింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిడిలోకి లొంగకుండా వెంటనే అక్కడ ఏర్పడ్డ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిందిగా డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పినప్పటికీ కలెక్టర్ కి మరియు ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చినప్పటికీ కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమని, కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో లేక స్వార్థం వల్లో ఆగిన కబ్జాలు మళ్ళీ మొదలయ్యాయని ఇప్పటికైనా వాటిని ఆపకపోతే ప్రజల దృష్టిలో వారు కబ్జాదారులకు సహకరించినట్టేనని భావిస్తారన్నారు. దేవాలయ స్థలాలను కాపాడుకోవడానికి ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలివచ్చి మా ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దేవాలయ భూముల పరిరక్షణ కొరకు శనివారం నాడు సంతకాల సేకరణ, ఆదివారం నాడు రిలే నిరాహార దీక్షలు మొదలు చేసి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని దానికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జనసేన నాయకులు సతీష్, బిజెపి నాయకులు మాధవులు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు రాములు ఏఐటీయుసీ కార్యదర్శి శ్రీనివాస్ కోశాధికారి సదానంద్ ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆటోలో ఆపద వస్తే.. ఒక్క స్కాన్‌తో పోలీసుల అలర్ట్

**కోదాడలో 800 ఆటోలకు 'మై ఆటో ఇస్ సేఫ్' రక్షణ స్టిక్కర్లు.. మహిళలు, విద్యార్థులు, బాలికల భద్రతే లక్ష్యం**






**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** మహిళలు, విద్యార్థినులు, బాలికలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మై ఆటో ఇస్ సేఫ్' కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలోని సుమారు 800 ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో కూడిన రక్షణ స్టిక్కర్లను అందించారు. బుధవారం కోదాడ పట్టణంలోని కాశీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై ఆటో డ్రైవర్లకు రక్షణ స్టిక్కర్లను అందజేశారు. ఆటోలో ప్రయాణించే సమయంలో ప్రయాణికులకు ఏదైనా అనుకోని ఇబ్బంది, ప్రమాద పరిస్థితి లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎమర్జెన్సీ బటన్‌ను నొక్కడం ద్వారా పోలీసులకు సమాచారం చేరే విధంగా ఈ భద్రతా వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎస్పీ తెలిపారు. అత్యవసర సమాచారం అందిన వెంటనే సంబంధిత పోలీసులు అప్రమత్తమై అవసరమైన రక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన వివరాలు, వారు ఉన్న ప్రాంతం వంటి సమాచారాన్ని అవసరమైన సందర్భంలో కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసే అవకాశం కూడా ఈ విధానం ద్వారా ఉంటుందని తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు ఒంటరిగా ప్రయాణించే సమయంలో భద్రతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా పోలీస్ శాఖ అందుబాటులో ఉండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించి 'టీ సేఫ్' యాప్ కూడా అందుబాటులో ఉందని ఎస్పీ తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను కేవలం గమ్యస్థానానికి చేర్చే వ్యక్తులుగానే కాకుండా ప్రజల భద్రతలో భాగస్వాములుగా వ్యవహరించాలని సూచించారు. ఆటో నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన నిబంధనలను పాటించాలని, ప్రయాణికులతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ప్రతిరోజూ వివిధ వర్గాల ప్రజలతో నేరుగా మమేకమవుతున్నందున సమాజంలో భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వంటి అంశాలపై చైతన్యం తీసుకురావడంలో వారు కూడా కీలక పాత్ర పోషించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీస్ శాఖ 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా నిరంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తోందని ఎస్పీ తెలిపారు. ప్రయాణికులు కూడా ఆటోలో ఎక్కే సమయంలో వాహన వివరాలను గమనించడం, అవసరమైన సందర్భాల్లో అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలను వినియోగించుకోవడం ద్వారా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు, బాలికలు, వృద్ధులు ప్రయాణించే వాహనాల్లో భద్రతా వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ నరసింహ సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ సరఫరా, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినప్పుడు పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు మరియు విద్యార్థుల భద్రత మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కోదాడ పట్టణంలోని సుమారు 800 ఆటోలకు క్యూఆర్ కోడ్ రక్షణ స్టిక్కర్లు అందుబాటులోకి రావడం ద్వారా రోజువారీగా ఆటోల్లో ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులకు అదనపు భద్రతా భరోసా కలగనుంది. అత్యవసర పరిస్థితుల్లో సాధారణంగా పోలీసులను సంప్రదించేందుకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా సమాచారం చేరేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పోలీస్ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, 'మై ఆటో ఇస్ సేఫ్' ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ రెడ్డి, పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## నేడు సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విస్తృత పర్యటన

**హుజుర్ నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు.. సమీక్షలు**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత వేగం తీసుకువచ్చేలా రాష్ట్ర నీటిపారుదల, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నేడు (గురువారం) హుజుర్ నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాలు, గ్రామాల్లో వరుసగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, నిర్మాణ పనులను పరిశీలించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపనలు, నూతన భవనాల ప్రారంభోత్సవాలు, అధికారులతో సమీక్షలు, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చింతలపాలెం మండలం పాత వెల్లటూరు నుంచి మంత్రి పర్యటన ప్రారంభం కానుంది. కృష్ణా నదిపై సుమారు రూ.1,600 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ఎంబీసీ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి పురోగతిపై అధికారులతో సమీక్షించనున్నారు. ఈ పథకం ద్వారా సుమారు 54 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం మేళ్లచెరువు--చింతిర్యాల రహదారి విస్తరణ, పటిష్ఠీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రేబల్లె, కొత్తగూడెం తండా, గాంధీనగర్ తండాల్లో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించనున్నారు. అనంతరం కోదాడ మండలం రామలక్ష్మీపురంలో మిర్యాలగూడ--కోదాడ ప్రధాన రహదారి నుంచి బాలాజీనగర్ మీదుగా హుజుర్ నగర్ వరకు చేపట్టనున్న రహదారి విస్తరణ, పటిష్ఠీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. హుజుర్ నగర్ మండలం అల్లిపురంలో అమరారం నుంచి కొత్తతండా వరకు చేపట్టనున్న ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పాలకవీడులో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించడంతో పాటు ఎల్లాపురంలో గుడుగుంట్లపాలెం--ఎల్లాపురం రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గడ్డిపల్లి నుంచి బొల్లిశెట్టివారిగూడెం మీదుగా కోనాయిగూడెం వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం హుజుర్ నగర్ ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయనున్నారు. చిలుకూరు మండలం సీతారాంపురంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను, కోదాడ బాలాజీనగర్‌లో నిర్మిస్తున్న జవహర్ నవోదయ పాఠశాల పనులను మంత్రి పరిశీలించనున్నారు. మునగాల మండలం ఆకుపాములలో నిర్మిస్తున్న ఎన్ఏసీ భవన నిర్మాణ పనుల పురోగతిని కూడా పరిశీలించనున్నారు. సాయంత్రం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి పనుల కార్యక్రమంలో పాల్గొని, అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను పంపిణీ చేయనున్నారు. నేటి మంత్రి పర్యటనలో సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మార్కెట్ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన పలు కార్యక్రమాలు ఉండటంతో జిల్లాలో పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. అభివృద్ధి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించడం, పెండింగ్ పనులపై అధికారులతో సమీక్షించడం ద్వారా పనులను వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. మంత్రి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, బ్లాక్, గ్రామస్థాయి నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ సమావేశం




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
సూర్యాపేట కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, డ్రాఫ్ట్ పబ్లికేషన్, పోస్ట్ డ్రాఫ్ట్ కార్యకలాపాలపై కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండేలా సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలు లేదా ఇతర అంశాలపై ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే సంబంధిత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, జాబితాలో ఉన్న వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ సూచనలు, అభ్యంతరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, జాబితా సవరణలో ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఓటర్లకు సంబంధించిన సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వాటిని నిర్ణీత విధానంలో సమర్పించి పరిష్కరించుకునే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
గురువారం 20-08-2026

# హుజూర్‌నగర్‌లో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

**మధుర జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు అందించే అద్భుత కళ ఫొటోగ్రఫీ**

**ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో వేడుకలు**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలో 187వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో, వీడియో గ్రాఫర్స్ మండల అధ్యక్షుడు జక్కుల మురళి జెండా ఆవిష్కరించి ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఫొటోగ్రఫీ రంగం ప్రాధాన్యత, సమాజంలో ఫొటోగ్రాఫర్ల పాత్ర, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఫొటోగ్రఫీ రంగంలో వస్తున్న మార్పులపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ కేవలం ఒక చిత్రాన్ని కెమెరాలో బంధించడం మాత్రమే కాదని, మన జీవితంలోని మధురమైన జ్ఞాపకాలను భద్రపరచి భవిష్యత్ తరాలకు అందించే అద్భుతమైన కళ అని పేర్కొన్నారు. ఒక ఫొటో ద్వారా ఒక సంఘటన, ఒక వ్యక్తి, ఒక కాలం, ఒక సందర్భానికి సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలను భద్రపరచవచ్చని తెలిపారు. కుటుంబ వేడుకలు, వివాహాలు, పుట్టినరోజులు, సామాజిక కార్యక్రమాలు, చారిత్రక సంఘటనలు, ప్రకృతి దృశ్యాలు ఇలా ప్రతి సందర్భాన్ని ప్రజలకు గుర్తుండిపోయేలా చేయడంలో ఫొటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఫొటోగ్రఫీ రంగానికి పితామహుడిగా గుర్తింపు పొందిన లూయిస్ డాగ్యూర్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఫొటోగ్రఫీ రంగం అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. గతంలో ఫొటో తీయడానికి అనేక ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ఫొటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ఆధునిక కెమెరాలు, డిజిటల్ టెక్నాలజీ, వీడియో గ్రాఫీ, డ్రోన్ కెమెరాలు తదితర సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఫొటోగ్రఫీ రంగం మరింత విస్తరించిందని పేర్కొన్నారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా మంచి ఫొటోగ్రాఫర్‌కు ఉండాల్సిన సృజనాత్మకత, సమయస్ఫూర్తి, నైపుణ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఫొటోగ్రాఫర్ తన వృత్తిలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలని సూచించారు. ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరించేందుకు సంఘం తరపున ఐక్యంగా కృషి చేస్తామని ప్రతినిధులు తెలిపారు. ఫొటోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ప్రత్యేకమైన రోజని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు తదితరులు పాల్గొని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## మిట్టపల్లి మల్లయ్య మృతదేహానికి బీఆర్ఎస్ నాయకుల నివాళి

**అనారోగ్యంతో మృతి.. పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు**

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**



**త్రిపురారం మండల రిపోటర్ ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** త్రిపురారం మండల కేంద్రానికి చెందిన మిట్టపల్లి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మల్లయ్య మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లయ్య మృతి కుటుంబ సభ్యులకు, బంధువులకు తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లయ్యతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న నాయకులు ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కష్టసుఖాల్లో కుటుంబ సభ్యులకు, బంధువులకు అండగా నిలవాలని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని నాయకులు కోరారు. మృతుడి కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బైరం లక్ష్మి కృష్ణ, జంగిలి శ్రీనివాస్, మజ్జిగపు వెంకటరెడ్డి, అనుముల సుధాకర్ రెడ్డి, బాతుకు నాగయ్య, నగిరి వెంకన్న, ఆంజనేయులు, తాటికొండ తిరుపతయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మిట్టపల్లి మల్లయ్యకు నివాళులర్పించారు..

## విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల మహాధర్నా




Mr. Mahe Bayireddi, CEO & Co-Founder, Phenom; briefing media the highlights of IAMPHENOM India 2026 - the only applied AI event dedicated to human resources and IT; organized by Phenom, a Philadelphia based Global leader in Applied AI for HR; at a press conference, today at ITC Kakatiya, Hyderabad.

**హైదరాబాద్ ఆగస్టు 19,ప్రజా న్యూస్ నెట్వర్క్ :** విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు పాల్గొని తమ సమస్యలపై ఐక్యంగా నిరసన తెలిపారు. పిఆర్సి2026 చర్చల కమిటీని ఏర్పాటు చేయాలని, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ల సిహెచ్ పి కేహెచ్పి. ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, ఆర్టిజన్లకు ఏపీ ఎస్ ఈ బి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. 1999––2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు ఫ్రాఖీ, పెన్షన్ సౌకర్యం కల్పించడంతో పాటు అన్ని కేడర్లలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, పెండింగ్ ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈపీఎఫ్ ఉద్యోగులకు పెన్షన్ ప్రయోజనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ సౌకర్యాలు, 2022 వేతన సవరణ లోపాల సవరణ, పారదర్శక జనరల్ ట్రాన్స్‌ఫర్ పాలసీ అమలు తదితర డిమాండ్లను కూడా ప్రస్తావించారు. ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు టీజీపీ ఈ జెఎసి. తో తక్షణం చర్చలు జరిపి సమస్యలకు న్యాయమైన పరిష్కారం చూపాలని మహాధర్నా డిమాండ్ చేసింది.

# బుల్లెట్ ట్రైన్ సాధన సమితి పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు

**సూర్యాపేటకు రైల్వే కారిడార్ సాధించే వరకు ఉద్యమానికి అండగా ఉంటాం: నిమ్మల శ్రీనివాస్ గౌడ్, వై. వెంకటేశ్వర్లు**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రానికి బుల్లెట్ ట్రైన్ రైల్వే మార్గం సాధించాలనే ప్రజల చిరకాల ఆకాంక్ష కోసం బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి భారత రాష్ట్ర సమితి పూర్తి మద్దతుగా నిలుస్తుందని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆరవ రోజు నిరాహార దీక్షకు హాజరైన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి సంఘీభావం ప్రకటించి వారు మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే మార్గం ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కేటాయింపు విషయంలో గతంలో ప్రతిపాదనలు వచ్చినప్పటికీ అనంతరం మార్గాన్ని మార్చడం పట్ల వారు ప్రశ్నలు లేవనెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి సూర్యాపేట జిల్లా కేంద్రానికి జాతీయ రహదారి 65కి సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సూర్యాపేటను రైల్వే కారిడార్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే కనెక్టివిటీ లేకపోవడం వల్ల సూర్యాపేట జిల్లా కేంద్రం అభివృద్ధిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ మార్గం ఏర్పాటైతే జిల్లాలో కొత్త పరిశ్రమలు, వ్యాపార అవకాశాలు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సూర్యాపేట ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసే వరకు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి చేపట్టే ప్రతి కార్యక్రమానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమ స్ఫూర్తితోనే సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ కోసం ప్రజా ఉద్యమం కొనసాగుతోందని, ప్రజల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం గుర్తించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కూడా తనవంతు సహకారం అందిస్తున్నారని, సాధన సమితి నిర్వహించే కార్యక్రమాలకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుండి పాల్గొంటారని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు. సూర్యాపేటకు రైల్వే మార్గం సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఉప్పల ఆనంద్, మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

## శ్రీ ప్రకాష్ 50వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఘన ముగింపు

**'గాతా రహే మేరా దిల్' ఫైనల్స్‌లో విద్యార్థుల ప్రతిభ.. విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్పీ శైలజ**




**తుని ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్వర్క్:** శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు 49 వసంతాలు పూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించిన 50వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో భాగంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం శాఖలకు చెందిన విద్యార్థుల మధ్య 'గాతా రహే మేరా దిల్' పేరుతో పాటల పోటీలు నిర్వహించారు.ఆరవ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. చివరి రోజు నిర్వహించిన ఫైనల్స్‌కు ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్పీ శైలజ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఎస్పీ శైలజ మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారని, నిరంతరం సాధన చేస్తే భవిష్యత్‌లో మంచి గాయకులుగా రాణించే అవకాశం ఉందని పేర్కొన్నారు.అనంతరం ఎస్పీ శైలజ తన పాటలతో ఆహుతులను అలరించారు. విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందని తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు ఇదే నిబద్ధతతో గత 49 వసంతాలుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు స్వయం ఉపాధి ద్వారా స్వావలంబన సాధించే లక్ష్యంతో విద్యను అభ్యసించాలని, ఇతరులపై ఆధారపడకుండా తమ నైపుణ్యం, కృషితో స్వయంగా సంపాదించుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. కేవలం మార్కుల కోసం కాకుండా సమాజంలో మార్పు తీసుకురావడానికి విద్యను ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం ముఖ్య అతిథి ఎస్పీ శైలజను జ్ఞాపికతో సత్కరించారు. పాటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఎస్పీ శైలజ, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు డా. నరేంద్రబాబు, కోశాధికారిణి సిహెచ్. రామసీత, సభ్యులు సబ్బవరపు సూర్యనారాయణ, వివిధ శాఖల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తుని, పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## గుంటపల్లిలో స్వచ్ఛతపై అవగాహన.. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని పిలుపు

**రోడ్లపై చెత్త వేయొద్దని సూచన.. పరిశుభ్రతను కాపాడేందుకు గ్రామస్తుల భాగస్వామ్యం అవసరమని వెల్లడి**



**పాయకరావుపేట (గుంటపల్లి) ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్వర్క్:** గుంటపల్లి గ్రామపంచాయతీలో స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపై చెత్త వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, గ్రామ ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన అధ్యక్షులు గేద్దం బుజ్జి, పల్లి దుర్గారావు, ప్రజాప్రతినిధులు, స్పెషల్ ఆఫీసర్ శరత్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో వై. సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

**విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల వైపు సాగాలి**

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహోత్సవం**




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గీత అధ్యక్షతన బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటిస్తామని, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తమ భవిష్యత్తును మంచి మార్గంలో తీర్చిదిద్దుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు కీలకమైన శక్తి అని, విద్యార్థి దశలోనే చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు, పొగాకు, గుట్కా తదితర హానికరమైన అలవాట్లు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు చదువు, కుటుంబ జీవితం, వ్యక్తిగత భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని వివరించారు. యువత స్నేహితుల ప్రభావం, సరదా పేరుతో ప్రారంభమయ్యే చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మక కార్యక్రమాలకు వినియోగించుకోవాలని తెలిపారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యసనాలకు బానిస కావడం వల్ల వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అందువల్ల యువత తమ ఆరోగ్యం, భవిష్యత్తు పట్ల బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వ్యసన విముక్తి అనేది ఒక్కరోజు కార్యక్రమంతో పూర్తయ్యే అంశం కాదని, ప్రతి ఒక్కరిలో నిరంతరం అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తుల్లో కూడా వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యువత ముందుండాలని, వ్యసన రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు తమ జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన, మంచి ఆలోచనలు, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులలో వ్యసనాలపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వ్యసనాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అభివృద్ధికి సహకరిస్తాం.. 40 ఏళ్లుగా ఉంటున్న మాకు ఆశ్రయం కల్పించండి

**ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక కాలనీని పరిశీలించిన తహసీల్దార్.. ఇళ్ల స్థలాలపై నివేదికకు ఆదేశం**

**పాయకరావుపేట, ఆగస్టు 19, ప్రజా న్యూస్ నెట్వర్క్ :** ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగంలో సుమారు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు అన్యాయం చేయకుండా ఆశ్రయం కల్పించాలని అక్కడి కాలనీవాసులు తహసీల్దార్‌ను కోరారు. అభివృద్ధి పనులకు తాము అడ్డంకి కాదని, తమ నివాస సమస్యకు పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో కాలనీని తక్షణమే ఖాళీ చేయించేందుకు జేసీబీ, పోలీసులతో అధికారులు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో కాలనీవాసులు తమకు ఆశ్రయం కల్పించాలని కోరుతూ అక్కడే నినాదాలు చేయడంతో అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కాలనీని పరిశీలించి, అక్కడ నివసిస్తున్న వారి వివరాలను వీఆర్వోల ద్వారా సేకరించారు.కాలనీవాసులతో మాట్లాడిన తహసీల్దార్.. అభివృద్ధి పనులు జరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. నివాసితుల వివరాలను అధికారులకు అందజేయాలని సూచించారు. 40 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందించేందుకు ముందుకు వచ్చారు. ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, వారి వివరాలను తక్షణమే సేకరించాలని తహసీల్దార్ సూచించారు. అలాగే మండల సర్వేయర్‌తో కలిసి నివేదిక రూపొందించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జార్జి, చిన్నారి, లోవతల్లి, బుల్లియ, రత్నం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

